## కబ్జాకు గురైన భూములపై విచారణ

తహసీల్దారుకు మొండిగౌరెల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఫిర్యాదు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో కబ్జాకు గురైన 5 ఎకరాల భూ విషయంలో ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని కోరుతూ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోలన్ రమాదేవి, ఉప సర్పంచ్ బడే కుమార్ , వార్డు మెంబర్లు సోమవారం యాచారం మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వేనంబర్ 127లో గ్రామ మాజీ సర్పంచ్ బండిమిది కృష్ణ, మాజీ వార్డు సభ్యులు ఎట్టి లక్ష్మయ్యలు 5 ఎకరాల భూమి కబ్జా చేసి అక్కడ ఎలాంటి కట్టడాలు లేకున్నా ఇంటి నంబర్లు తీసుకున్నారని వారు అరోపించారు. ఈ భూమిని మరి కొంతమందికి గుట్టు చప్పుడు కాకుండా అమ్మి ఇంటి నంబర్లు తీసుకున్నారని తెలిపారు. ఈ భూమికి సంబందించి అర్డిఒ, మండల పరిషత్ ఎంపిఓకు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే ఆ భూమిని స్వాధినం చేసుకోని సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమం లో వార్డుమెంబర్లు తాండ్ర రవీందర్‌తోబాటు రైతులు పాల్గొన్నారు.

## ఖానామెట్ చెరువు కాపాడండి

సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ చెరువును కొంతమంది కబ్జాదారులు అక్రమించి సర్వే నెంబర్ 7లో గల ఈదులకుంట చెరువు 6.05 ఎకరాల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపదుతున్నారని వెంటనే మండల రెవెన్యూ అధికారలు చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సోమవారం సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందు యాదవ్ రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖానామెట్ గ్రామ పరిధీలోని సర్వే నెంబర్ 7లో గల 6.05 ఎకరాల చెరువు స్థలాన్ని కబ్జా చేసి సెల్లార్ తొవ్వుతున్నారని వెంటనే వారిపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువు ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు గతంలో రాత పూర్వకంగా వివరాలు ఇచ్చారని అయిన ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఈదులకుంట చెరువు విషయంలో హైడ్రా పట్టించుకొని చెరువు హద్దులను ఏర్పాటు చేయాలని లేదంటే కబ్జా చేసిన స్థలం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, వెంకటస్వామి, ఖాసీం, జెట్టి శ్రీనివాస్, నారాయణ, రఘు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు తప్పని సరి చేయించాలి

వ్యవసాయశాఖ అధికారిణి విద్యాధరి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** రైతులు భూసార పరీక్షలతో నాణ్యమైన పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖ అధికారిణి విద్యాధరి రైతులకు సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం ముకునూర్ గ్రామంలో రైతు వేదిక సమీపంలో 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి మాట్లాడుతూ సాగులో బిపిటి, తెలంగాణ సోనతో పాటు వివిధ రకాల వరి పంటలు సాగు చేసి అధిక దిగుబడి పంటలు పొందాలన్నారు. ఆరు తడి, అంతర్ పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. జూన్ 2వ తేదీ లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అంద చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్ శిల్ప, అధికారులు డాక్టర్ ఆనంద్, సరోజిని, సురేష్, సరస్వతి, శ్రావణ్ కుమార్, సృజన, గణేష్, లక్ష్మయ్య, కార్యదర్శులు వీణ, లింగయ్య, శివకుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎంఆర్‌ఎఫ్ నిధులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందని, వైద్య పరంగా ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ద్యాగ సువర్ణ అనారోగ్య సమస్యతో బాధపడుతూ మెరుగైన వైద్య సహాయం కోసం ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిని అశ్రయించారు. దాంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు చేయగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యపరంగా పేదలను అదుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వైద్య కోసం ఖర్చు చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న గ్రామీణ పేదలకు వరంగా మారందని, ధరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్దిదారుడికి ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. దాంతో లబ్దిదారులు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్సీ సిఫార్స్‌తో రూ.1.10లక్షల విలువైన ఎల్‌ఓసి మంజూరైంది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కును లబ్దిదారుడి కుటుంబ సభ్యులకు అంధించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ జడ్పిటిసి తనయుడు రామకృష్ణ, నేతలు దినేష్ సాగర్, హనుమారి రాజుతోపాటు లబ్దిదారుడు ఉన్నారు.

# వలస కార్మికుల భద్రత మనందరి బాధ్యత

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర అభివృద్ధిలో వలస కార్మికుల శ్రమ ఎంతో ఉందని, వారికి రక్షణ కల్పించి భరోసానివ్వాల్సిన బాధ్యత మనపై ఉందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంప్‌లో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక "వర్క్ సైట్ స్కూల్"ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, సిఎంసి కమిషనర్ సృజన, జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుందర్‌రావులతో కలిసి ప్రారంభించారు. విద్యా, మున్సిపల్ శాఖ, రాజపుష్ప ప్రాపర్టీస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివిధ రాష్ట్రాల నుండి బతుకుదెరువు కోసం వచ్చిన కార్మికుల పిల్లలకు రక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ఈ పాఠశాల ప్రధాన ఉద్దేశ్యం, ఈ సందర్భంగా సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ వలస కార్మికులకు .సర్వ శిక్ష అభియాన్, అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమని తెలిపారు. అంగన్వాడీ తరహా కేంద్రాల ద్వారా పిల్లలకు క్రమశిక్షణ, మంచి ప్రవర్తన నేర్పించి, వారిని నేరాల బారిన పడకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం సైబరాబాద్ లో 100 కు పైగా లేబర్ క్యాంపుల్లో ఉన్న వేలాదిమంది చిన్నారులకు చదువు చెప్పించే బాధ్యతను ప్రతి ఒక్కరూ పంచుకోవాలని కోరారు. ముఖ్యంగా పిల్లలకు వారి మాతృభాషలోనే విద్యాబోధన చేయడం ద్వారా వారు త్వరగా నేర్చుకుంటారని సూచించారు. తక్కువ సమయం లో ఇంత చక్కటి ఆలోచనకు కార్యరూపం కల్పించిన నార్సింగి స్టేషన్ హౌస్ అధికారి హరి కృష్ణారెడ్డిని అభినందించారు. సిఎంసి కమిషనర్ సృజన మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ఆదర్శంగా నిలిపే క్రమంలో కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనే కాకుండా, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌ను కూడా బాధ్యతగా తీసుకుంటామని తెలిపారు. బతుకుతెరువు కోసం వలస వచ్చిన కార్మికుల పిల్లలకు కనీస హక్కులు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేసిన సైబరాబాద్ సిపిని అభినందించారు. పిల్లలకు ఒక మంచి వాతావరణాన్ని, భద్రతను కల్పించడం మనందరి బాధ్యత అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్‌రావు మాట్లాడుతూ వలస కార్మికుల పిల్లలకు విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ కింద లేబర్ క్యాంపుల్లోని పిల్లలకు పాఠశాల వసతి కల్పించి,వారు చదువుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు విద్యా హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని,భవిష్యత్తులో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.మధ్యాహ్న భోజన వసతి కూడా అక్షయ పాత్ర ద్వారా అందచేస్తామని తెలిపారు. రాజపుష్ప ఫౌండేషన్ పుష్పలీల మాట్లాడుతూ ప్రస్తుతం ఈ క్యాంప్ లో జార్ఖండ్, ఒడిశా, యూపి, అస్సాం వంటి రాష్ట్రాల నుండి వచ్చిన 58 మంది పిల్లల కోసం ప్రత్యేక విద్యా వసతులు కల్పించామన్నారు. వీరి కోసం విద్యాశాఖ నుండి ఒకరు, రాజపుష్ప ప్రాపర్టీస్ తరపున ఒక మహిళా టీచర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ఇటువంటి పాఠశాలలను రాజపుష్ప ఫౌండేషన్ తరపున శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసి, కార్మికుల బిడ్డలకు విద్యా ప్రోత్సాహాన్ని అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిసిపి చింతమనేని శ్రీనివాస్, కూకట్‌పల్లి ఎడిసిపి సుదర్శన్, రాజ్ పుష్ప ఎండి మహేందర్ రెడ్డి,నార్సింగి ఎస్‌హెచ్‌ఒ హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్వరమే అర్జీలు పరిష్కరించేందుకు కృషి







అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కారించేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్(రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను స్పష్టం చేశారు.

### రైతు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ మే 4 నుండి ప్రారంభమైన రైతు వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని వివరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా జనాభా గణన కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతిఒక్కరు స్వీయ గణనలో పాల్గొని తమ తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. స్వీయగణన ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌సైట్‌ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి ప్రారంభమయిన ఈ స్వీయగణన కార్యక్రమం మే 10 వరకు జరుగుతుందని, ప్రతిఒక్కరూ స్వీయ గణన ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. స్వీయ గణనలో గుర్తించబడిన ఉద్యోగులు, సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినపుడు ఐడి వివరాలు తెలియపరచాలన్నారు. కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** ప్రకృతి వ్యసాయంపై రైతులు అవగాహన పెంచుకొవాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ వరప్రసాద్ అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైతు వేధికల్లో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికల్లో భాగంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులను పంపిణి చేశామన్నారు. నేలను కాపాడుదామని ప్రతిజ్ఞ చేయించారు. నానో ఎరువుల వాడకం మట్టి నమూన పరీక్షలకు సంబంధించి రైతులకు వివరించారు. నీటి నిర్వహణ, పంటల మార్పిడి గురించి తెలిపారు. తెగుళ్ళు, నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి రవినాథ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** నియోజక వర్గం ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాక్షించారు. సోమవారం మండల కేంద్రంలో మల్లికార్జున ఆలయంలో జరిగిన శ్రీమల్లన్న కల్యాణోత్సవానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తకుర్మ శివకుమార్, ఆకుల యాదగిరి, యాదవ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో నేలలు సారవంతం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సేంద్రియ వ్యవసాయంతోనే పంట పొలాలు సారవంతంగా ఉంటాయని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని ఎలికట్ట, వెల్‌జర్ల, బూర్గుల, చించోడు, మధురాపూర్ గ్రామాలోని రైతు వేదికల్లో రైతు వారోత్సవాలను నిర్వహించారు. సారవంతమైన నేలను తయారు చేయడంపై రైతులతో ప్రతిజ్ఞ చేయించడంతోపాటు నానో ఎరువులు, మట్టి నమూనా పరీక్షలు, ప్రకృత వ్యవసాయంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష విధానము, ఎరువుల సమతుల్యతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పంటల వారిగా నీటి వినియోగం, పంటల మార్పిడి, పచ్చిరొట్టె పంటల ప్రాధాన్యత, సమయానుకూలంగా పంటల సాగు, తెగుళ్ల, పురుగులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రణ చర్యలపై ఏఈఓలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల ఏఇఓలు తేజ్‌కుమార్, హైమావతి, ప్రణీత, రాంబాబు, గోవర్ధన్‌లతోపాటు ఎలికట్ట సర్పంచ్ నవకిరణి నరసింహులు, రైతులు పాల్గొన్నారు.



# పల్లెలను ప్రగతి సీమలుగా మార్చాలన్నదే లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొత్తూరు:** పల్లెలను ప్రగతి సీమలుగా మార్చాలన్నదే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం కొత్తూరు మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో డ్వాక్రా, గ్రామ పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సర్పంచ్ జయప్రద జగన్మోహన్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. మహిళా సంఘాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయడంతోపాటు కొత్తగా గ్రామ పంచాయతీ భవనాలను సైతం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సబడ్డం వర్గాల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇండ్లతోపాటు ఫించన్లు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, రోడ్ల సౌకర్యం, భవన నిర్మాణాలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు లోటు రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డ్వాక్రా భవన నిర్మాణానికి రూ.20లక్షలు హెచ్‌ఎండిఎ నిధులు, గ్రామ పంచాయతీకి ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.20లక్షలు మంజూరు చేయించి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలందరు సహకరించాలని, అప్పుడే ముందుకు వెళ్ళేందుకు అస్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు మున్సిపల్ మాజీ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, ఉప సర్పంచ్ అండాలు, ఎంపిడిఒ అరుంధతి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు మారవోని రాజు, మారవోని శ్రీను, హరినాథ్‌రెడ్డి, మెండే కృష్ణ, చిందుల శ్రీను, అంజిరెడ్డి, సాయిలు, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రహదారులు అభివృద్ధి చేయాలని వినతి

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఉమ్మడి మాదాపూర్ డివిజన్ పరిధీలోని గోకుల్ ప్లాట్స్ లో అధ్వానంగా మారిన 80 ఫీట్ల రోడ్డును వెంటనే అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని మాదాపూర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గోకుల్ ప్లాట్స్‌లోని 80 ఫీట్ల రోడ్డు గుంతలమయంతో స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే 80 ఫీట్ల రోడ్డును అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని మాదాపూర్ సర్కిల్ కార్యలయంలో ప్రజావాణిలో డిప్యూటీ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. 80 ఫీట్ల రోడ్డు మరమ్మత్తులు చేపట్టి డివైడర్ సైతం ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయని అధికారులకు తెలియజేశామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు వినోద్ రెడ్డి, భరత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మహెష్ గౌడ్, లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, అభి నాయకులు పాల్గొన్నారు.




## బిజెపి శ్రేణుల విజయోత్సవ సంబరాలు

**ప్రజాపక్షం/కేశంపేట:** మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిన నేపథ్యం లో బిజెపి శ్రేణులు విజయోత్సత సంబరాల్లో మునిగిపోయారు. సోమవారం కేశంపేట మండల కేంద్రంలో బిజెపి రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంపి డికె అరుణ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంపై బాణాసంచా కాల్చి అంబేద్కర్ చౌరస్తాలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పసుల నర్సింహ్ యాదవ్, తలసాని పవన్‌కుమార్‌రెడ్డి, కడియాల అంజయ్య, కృష్ణ యాదవ్, రోళ్ల రఘురాంగౌడ్, కారెడ్ల నరేందర్‌రెడ్డి, పాలాది శ్రీను, తాతేపల్లి నర్సింహ్, రాఘవచారి, చంటి, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మాసిటీ బాధిత రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీ బాధిత రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రైతులకు హామీ ఇచ్చారు. గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న గిరిజన రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం అయన మద్దతు పలికారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తాం, రైతుల భూములు తిరిగి ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని అయన ప్రశ్నించారు. కోర్టు అర్డర్‌ను అధికారులు ధిక్కరించి భూసేకరణ చేస్తూ రైతులపై కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమన్నారు. మట్టిని నమ్ముకొని బతుకుతున్న రైతులకు అన్యాయం చేస్తే సహించేదిలేదన్నారు. మండుటెండలో 54 రోజులుగా రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. భూములు కాపాడుకునేందుకు రైతులందరు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకులు కవుల సరస్వతి, శ్రీకాంత్‌నాయక్, కానమోని గణేశ్, బోడ్డు సందీప్‌రెడ్డి, కుందారపు నారాయణ, అనసూయ కుర్మిద్ద గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య, కిషన్‌నాయక్, కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



## విద్య, వైద్య రంగాలకు లయన్స్ క్లబ్‌లు సహకరించాలి

### ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కృషి చేస్తున్న విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి తమతమ ప్రాంతల్లో లయన్స్ చేయూతనివ్వాలని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అంతాయిపల్లి లోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న లయన్స్ మల్టిపుల్ జిల్లా దశమ వార్షికోత్సవంలోముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన చిన్నతనంలో తన దివంగత తండ్రి శ్రీపాదరావుతో కలిసి లయన్స్ క్లబ్ సమావేశాల్లో పాల్గొన్న సంఘటనలను గుర్తు చేశారు. సమాజంలోని అవసరార్ధులను ఆదుకోవడంలో నిస్వార్ధ సేవలకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్న లయన్స్ క్లబ్‌లు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి సమాజసేవ చేస్తున్న లయన్స్ క్లబ్‌ల సేవలు అద్భుతం అని కొనియాడారు. రాష్ట్రంలో లయన్స్ సేవలు వృద్ధి చెందడానికి ప్రభుత్వం తప్పకుండా సహకరిస్తుందని లయన్స్ సేవా కేంద్ర భవన సముదాయం నిర్మాణానికి కావాల్సిన భూమిని ముఖ్యమంత్రిలో మాట్లాడి ఇప్పించుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మొదటి రోజు కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కౌన్సిల్ 11వ చైర్మన్‌గా అమర్‌నాద్‌రావు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎస్ కోదండరాం, కోశాదికారిగా ఇన్నారెడ్డిలు నియామకమయ్యారని లయన్ జిల్లా చైర్మన్ టి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటి చైర్మన్ జిఆర్ సూర్యరాజ్, కన్వెన్షన్ చైర్మన్ గోలి అమరేంద రరెడ్డి, చీఫ్ కోఆర్డినేటర్ ఎస్ఎం రెడ్డి, నరేందర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ టీం సభ్యులు అమర్‌నాద్‌రావు, డా విజయలక్ష్మి, నరసింహారాజు, పద్మావతి, మాజి చైర్మన్‌లు, పూర్వ జిల్లా గవర్నర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్లైఓవర్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కొండాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పెండింగ్‌లో ఉన్న 4.18 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్‌లు సోమవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నివాసంలో కలిసి వినతి పత్రాని అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన 4.18కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే మంజూరు చేసి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని దుద్దిళ్ల శ్రీధర్ బాబుని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కడుపోల్ల మల్లేష్, కుతాడి రవీందర్, మాజీ సర్పంచ్ డక్కి రమేష్, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, మమ్మద్ ఖయ్యూం, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, బర్ల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



## 'పది'లో సత్తా చాటిన అన్విత

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ విహారి హోమ్స్‌లో నివాసం ఉంటున్న మాటూరి నాగ రాజు, శైలజ దంపతుల కుమార్తె అన్విత 6వందల మార్కులకు గాను 580 పైచిలుకు మార్కులు సాధించింది. ఈ సందర్భంగా అన్విత మండల స్థాయి ప్రథమ స్థానం పొందినందుకు విహారి హోమ్ కాలనీ సొసైటీ సభ్యులు కొక్కు ప్రభాకర్, నర్సయ్య, ప్రవీణ్, ధర్యాసింగ్, నరేందర్, రవి,యాకస్వామిలు కలిసి విద్యార్థి అన్వితను శాలువాతో సత్కరించి అభినందించారు.



## రాజు యాదవ్‌కు 'శ్రమ శక్తి' అవార్డు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్లాపూర్ ప్రాంతానికి చెందిన క్యాబ్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన పంజా రాజు యాదవ్‌కు మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన శ్రమ శక్తి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆయనను అభినందిస్తూ కార్మికుల హక్కులు, న్యాయపరమైన డిమాండ్లకోసం పని చేస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ప్రవీణ్ కుమార్, మహేందర్‌గౌడ్, కుర్మయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**ప్రజాపక్షం/నవాబుపేటః** ఎకమామిడి గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. సోమవారం రైతు పసుల రాజు ఎద్దు, పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల విలువగల ఈ ఎద్దు మృతి చెందడంతో రైతుకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ ఘటనపై గ్రామస్తులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు సరైన రక్షణ చర్యలు లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే నష్టపోయిన రైతు పసుల రాజుకి తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని గ్రామస్తులు, బాధిత రైతు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో

# భూమాతను రక్షించుకుందాం

**రైతు వారోత్సవాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు**







**ప్రజాపక్షం/తాండూరుః**ప్రతి ఒక్కరు పకృతి వ్యవసాయాన్ని సాగు చేసి, భూ మాతను రక్షించుకోవడంతో పాటు ప్రజా రోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులోని ఎస్‌విఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు వారోత్సవాలకు మంత్రి ముఖ్యఅధితిగా హాజరై శ్రీకారం చుట్టారు. జిల్లాలో '99రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 9వరకు రైతు వారోత్సవాలు సాగుతాయని తెలిపారు. అంతకుముందు మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలంగాణ గీతంతో పాటు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్గానిక్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పకృతి వ్యవసాయసాగుకు ప్రయత్నం చేయకపోతే భవిష్యత్తులో భూమి మొత్తం నిస్సారమవుతుందని, తక్కువ పెట్టుబడి తో ఎక్కువ పంటలు పండించి ముందుకు వెళ్ళాలన్నారు. రైతులు ఆర్గానిక్ పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు. భూములను రక్షించే ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, భూమాతను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సైంటిస్టులు భూమిని ఏరకంగా సంరక్షించుకోవాలో రైతులకు అవగాహ న కల్పించాలన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయుటకు లక్ష 40వేల కోట్లు రైతుల ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో 40నుండి 50 క్వింటాళ్ళ దాకా మొక్కజొన్న పంటను అత్యధికంగా రైతులు పండిస్తున్నారని, అత్యధికంగా పంటలు పండించే రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. పకృతి పంటలు పండించిన లావణ్యరెడ్డితో కలిసి టిజి ఆర్గానిక్ యాప్‌ను మంత్రి ప్రారంభించారు.

రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా పామాయిల్ సాగులో మూడవ దశలో ఉందన్నారు. ఫాం ఆయిల్ సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఫాం ఆయిల్ పంట మార్కెటింగ్ కోసం జిల్లాలో ఫాం ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. తాండూరు కందిపప్పుకు మంచి బ్రాండ్ ఉందని, తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే నోహర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక లాంటి వాడని, వ్యవసాయం దండగ కాదు...వ్యవసాయం ఒక పండుగగా జరుపుకోవాలన్నారు. మంత్రి చొరవతో వ్యవసాయ రంగాన్ని ముందు కు తీసుకువెళ్ళాలన్నారు. తాండూరు మార్కెట్‌కు రూ. 14 కోట్ల నిధులు మంజూరయ్యా యని అన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమీషనర్ సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజ బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ నర్సిములు, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

**పామాయిల్ తోటను సందర్శించిన మంత్రి**

తాండూరుకు చెందిన డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రైతు రవిందర్‌గౌడ్ సాగుచేసిన పామాయిల్ తోటను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. తాండూరు చెంది న రైతు, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ జుంటుపల్లి సమీపంలో సాగు చేసిన పామాయిల్ తోటలను పరిశీలించారు. పామాయిల్ సాగులో రాష్ట్రంలోనే వికారాబాద్ జిల్లా 3వ స్థానంలో ఉందని, మరింత సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

## వారం రోజుల పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మేడ్చల్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు మరింత ఉపయోగపడే లక్ష్యంగా ఈ నెల 9 వరకు వారం రోజుల పాటు రైతు వారాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయాధికారి చంద్రకళ పేర్కొన్నారు. దీనిలో భాగంగా సోమవారం సాయిల్ కలెక్షన్ దాని ప్రాముఖ్యత, సాయిల్ హెల్త్ కార్డు పంపిణీ, వాటి ఆధారంగా ఎరువుల వాడకం, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన, నానో యూరియా ప్రమోషన్, సహజ వ్యవసాయ విధానం, వ్యవసాయ నిర్వహణ, సన్న వరి రకాల సాగు అంశాలపై అవగాహన కల్పించామన్నారు.


## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

### మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** భూసార పరీక్షలు చేసిన తర్వాతనే రిపోర్టుల ఆధారంగా తగిన పంటలను వేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అలియాబాద్, లాల్‌గడిమలక్‌పేట రైతు వేదికల్లో రైతు వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ, ఎరువులు యాజమాన్యం, మట్టి నమూనాలను తీసే విధానాలను రైతులకు వివరించడం జరిగిందన్నారు. అలాగే భూసార పరీక్షల కార్డులను పంపిణి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ జశ్వంతరెడ్డి, ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, మున్సిపాలిటి కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మేడ్చల్ మట్టి నమూనాల పరీక్ష కేంద్రం అధికారి కృష్ణవేణి, ఎఇఒలు సుదీర్‌కుమార్, రవియాదవ్, రైతులు కమతం కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో..**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4 నుంచి 9 వరకు రైతు వారోత్సవాలను నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయాధికారి ప్రవీణ తెలిపారు. సోమవారం రైతు వేదికలో రైతుల కు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాలు, మట్టి నమూనాలు తీసే విధానం, భూసార పరీక్షల కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాంరవి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, కౌన్సిలర్లు, రైతులు, ఎఇఒ సురేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆటిజం కేసుల నివారణకు చర్యలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రోజు రోజుకు పెరుగుతూ ఆందోళన కల్గిస్తున్న ఆటిజం ప్రాబల్యాన్ని నివారించేందుకు ప్రభుత్వ సంస్థలు, నియంత్రణ సంస్థలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే విషయంలో మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రీప్లేస్ ఆటిజం రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్, డైరెక్టర్ కళా రమ్య, పిఆర్ ఓ లాలూప్రసాద్‌లు తెలిపారు. దీని కోసం పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించటం, నీటి భద్రతను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలంటూ వారు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కల్సి ఆటిజం ప్రభావం, నివారణ అంశాలపై నివేదికతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి 50 మంది సంతానంలో ఒకరు ఆటిజంతో బాధపడుతున్నట్లు గుర్తించామని, రానున్న రెండు దశాబ్దాల కాలంలో ఈ సంఖ్య ప్రతి పది మంది సంతానంలో ఒకరికి వచ్చే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయంలో వినియోగించే రసాయనాలు, పరిశ్రమల నుంచి వర్చే రసాయనాల ప్రభావంతో మంచి నీటిలో ఏర్పడే కాలుష్యాలు, నాన్‌స్టిక్ వంట పాత్రల నుంచి విడుదలయ్యే విష పూరిత పదార్థాలు, ఆహార పరిరక్షణ వంటి రసాయనాలు ఆటిజానికి కారణాలవుతున్నాయని, వీటి ప్రభావాన్ని తగ్గిస్తూ ఆటిజంను నివారించేందుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

### మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్ ప్రజావాణిలో ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ః** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘనాపూర్ గ్రామ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వేముల సంజీవ గౌడ్ మాట్లాడుతూ ఘనాపూర్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి.ప్రజావాణిలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారుల నుండి స్పందన లేదని ఇకనైనా ఈ ఫిర్యాదుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

### అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా వరి కొనుగోలు కేంద్రలను ప్రారంభించి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులను ఆదేశించారు. సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, అకాల వర్షాల వల్ల వరి ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట మంత్రితో విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 129 వరికొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలను సమకూర్చుకొని రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. మార్కెట్ అధికారులు వరి కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తూనిక, తేమ, వరని అర బెట్టె యంత్రాలతోపాటు తాడపత్రీలను సమకూర్చుకోవాలని అధికారులను అదేశించారు. ఆకాల వర్షాల కారణంగా ధాన్యం తడిచి పోకుండా ముందస్తుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ మురళికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్ ,డిఆర్‌డిఓశ్రీనివాస్, డిసిఓ నాగార్జున. తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి 120 దరఖాస్తులు**

ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణికి 120 దరఖాస్తులు వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల నుండి స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు సంబంధించిన లబ్దిదారులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా తాండూర్, వికారాబాద్‌లో నిర్వహించే ప్రజవాణి స్థాయిలో అధికారులు పాల్గొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, డిపిఒ జయసుధ, డిటిడిఓ కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన స్పీకర్

**ప్రజాపక్షం /వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని అనంతగిరిపల్లి లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ సందర్భంగా లబ్దిదారులతో గృహప్రవేశం చేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

**వరికొనుగోలు కేంద్ర ప్రారంభం**



**ధారూర్ :**వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల పరిధి లోని హరిదాస్ పల్లి పిఎసిఎస్ సెంటర్ ఆధ్వర్యంలో గట్టేపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన స్పీకర్ అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు వడ్లు అమ్ముకొవాలని సూచించారు.

**వికారాబాద్ రూరల్ః సర్పంచులకు సన్మాన కార్యక్రమంః**

అనంతరం వికారాబాద్ మండలనికి సంబంధించిన అనంతగిరి హరితా రిసార్ట్ లో సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారిని సన్మానించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రజలకు సేవచేసి మంచిపేరు తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, గురువారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.






## సాయిలును సన్మానించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట, రోడమేస్త్రీ డివిజన్ లెనిన్‌నగర్ బస్తీ ఎన్నికల్లో సిపిఐ, ఎఐటియుసి నాయకులు సిహెచ్ సాయిలు 40 ఓట్ల మెజార్టీతో గెలుపొందడంపట్ల నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయిలును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్తీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పార్టీకి గౌరవం తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. బస్తీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో సిపిఐ నాయకత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, కోశాధికారి సదానంద్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, సిపిఐ నాయకులు సహదేవ్‌రెడ్డి, వెంకటేష్, ఇమామ్, సామెల్, రవి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో ఓపెన్ జిమ్ ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని సిఫిన్ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను సోమవారం మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఆసోసియేషన్ సభ్యులు రాజ్, అరుణ్, పెద్దిరాజు, చంద్రకళ, భాను ప్రకాష్, కాంగ్రెస్ నేతలు బాబు సత్య నారాయణ, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ వార్షికోత్సవంలో ప్రముఖులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేటలోని కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం, జాతరలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, టిపిసిసి అధికార ప్రతినిది సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మాజీ ఎంపిపి ఎల్లుబాయిబాబు, మాజీ జడ్పిటిసి అనితలాలి, మాజి చైర్మన్ మ్యాకల మహేందర్‌యాదవ్, సోసైటి మాజి వైస్ చైర్మన్ మ్యాకల ఐలయ్య, వంగ వెంకట్‌రెడ్డి, మాజి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పరిగి నూతన సిఐగా కొండల్‌రెడ్డి

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి నూతన సిఐ గా కొండల్‌రెడ్డి సోమావారం బాధ్యతులు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పరిగి సర్కిల్ పరిధిలోనిప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపైన చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్ష /పూడూర్ :** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల చెంగోముల్ గ్రామ వాస్తవ్యులు మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ అజీమ్, పరిగి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లోకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నాను అని ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలపరచడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు అమ్రది శ్రీనివాస్ గుప్తా, రామస్వామి,తదితరులు పాల్గొన్నారు.

